# అందాల విందు

ఆంధ్రభూమి వీక్లీ.. 18 అక్టోబర్, 2001




"పెళ్ళివారికి అమ్మాయి నచ్చిందట!"

పోస్టుమేన్ ఇచ్చిన ఉత్తరాన్ని చదివి రమణయ్య విషయం చెబుతూంటే... ఆ ఇంట్లోని వారంతా ఆనందంతో తబ్బిబ్బవుతున్నారు.

"ఇతర విషయాలు మాట్లాడుకునేందుకు రేపు ఆదివారం వస్తున్నారు. ఇది చాలా మంచిసంబంధం! అబ్బాయి బుద్ధిమంతుడు, మంచి పొజిషన్‌లో ఉన్నాడు. కృష్ణమూర్తిగారు కూడా ఆర్థికంగా మంచి స్థితిపరులు. ఈ సంబంధం ఖాయమైతే బాగుండు... అంతా వెంకటేశ్వరుని దయ! భార్గవి అదృష్టవంతురాలు... తప్పక సుఖపడుతుంది!"

– ఉల్లాసంగా భర్త చెబుతూంటే... ఆనందంతో వింటోంది సువర్చల.

రమణయ్య ఏదో చిన్నఉద్యోగం చేసి రిటైరైన వ్యక్తి! ఒక్కగానొక్క కూతురు భార్గవి. పెద్దగా ఆస్థిపాస్తులు లేకపోయినా తిండిబట్టలకు లోటు లేకుండా సంసారాన్ని ఈడ్చుకొస్తున్నాడు.

కూతుర్ని పోస్టుగ్రాడ్యుయేషన్ వరకు చదివించాడు.

భార్గవి మంచి ఒడ్డూ, పొడుగుల వయ్యారాలతో, ఇంపైన సౌందర్యాలతో ఇతరుల్ని ఇట్టే ఆకట్టుకునే పాతికలోపు వయసున్న ఛవ యవ్వనరాశి! ఆమె గురించి ఒక్కమాటలో చెప్పాలంటే... తను ఒక పరువాల పొదరిల్లు!

రమణయ్య కూతురు పెళ్ళికోసం ఎక్కని గడపలేదు, దిగని మెట్టూ లేదు.

తన కూతురుకి ఏమి తక్కువ?

చదువు తక్కువా, సంస్కారం తక్కువా లేక అందచందాలు తక్కువా? కానీ, కట్నం ఇవ్వలేని లేమితనం అతన్నీ, అతని భార్య సువర్చలనీ ఎంతగానో బాధిస్తోంది.

కృష్ణమూర్తిగారి సంబంధం ఖాయం అవుతుందని మొదట ఊహించకపోయినా... మొత్తానికి నిశ్చయమైంది.

అబ్బాయి శ్రీకాంత్ మృదుస్వభావి. భార్గవిని తొలిచూపులోనే వలచి తన అంగీకారాన్ని తెలియజేశాడు. మంచి ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో ఉన్న శ్రీకాంత్‌కి నెలకు ముప్పైవేలు పైచిలుకు జీతం! కృష్ణమూర్తి వ్యాపారాలు చేసి చాలా డబ్బు కూడబెట్టాడు.

భార్గవి మనసు పరిపరి విధాల పోతోంది–

'చూస్తుంటే కుర్రాడు బాగానే ఉన్నాడు. కాని, వారి గొంతెమ్మ కోర్కెలకు తూగే తాహతు తమకుందా?' ...అని!

• • •

కృష్ణమూర్తి ఐదులక్షల రూపాయలు కావాలని 'కట్నం బాంబు' పేల్చేసరికి– రమణయ్య నివ్వెరపోయాడు.

"మా అబ్బాయి ఆఫీసరు... నెలకు ముప్పైవేల జీతం! నాకు మొత్తం అన్నీ కలుపుకొని ఓ యాభైలక్షల విలువైన ఆస్థులున్నాయి. వాడికి ఏడెనిమిది లక్షల వరకూ కట్నంగా ఇస్తామని వస్తున్నారు. కాని, మాకు అమ్మాయి నచ్చడంతో కేవలం ఈ సొమ్ములతోనే సరిపెట్టుకుంటున్నాము"

రమణయ్య చాలా బాధపడ్డాడు. తాను తల తాకట్టు పెట్టి అతికష్టం మీద యాభైవేలు వరకు మాత్రమే ఈయగలడు.

"క్షమించండి... మీరు అడిగినంత సొమ్ము ఇవ్వగలిగే స్తోమత నాకు లేదు. యాభైవేలకు మించి ఇవ్వలేని స్థితి మాది!"

రమణయ్య మాటలు విని లేవడానికి సిద్ధపడ్డారు కృష్ణమూర్తి.

భార్గవికి ఒక్కసారి కళ్ళనీళ్ల పర్యంతమైంది... 'అమ్మానాన్నల్ని చూస్తుంటే చాలా బాధ కలుగుతోంది. కృష్ణమూర్తి మీద కోపం ముంచుకొచ్చింది. ఉద్యోగం చేసి అమ్మానాన్నలకు కొంతవరకూ సహాయపడదామంటే ఈరోజుల్లో ఏమీ దొరకడంలేదు!'

– ఆలోచిస్తూన్న ఆమె మనసు ఒకింత గట్టిపడింది... "నాన్నా! ఈ సంబంధం ఖాయం చేయండి... అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు!" అంది.

"ఏమిటే నువ్వంటున్నది... ఐదు లక్షల రూపాయలు ఎక్కడినుంచి తేగలం? పెళ్ళి ఖర్చులకి కనీసం పైన మరో లక్ష అవుతాయి. ఈ ఇల్లు అమ్మినా రెండు లక్షలకి మించి రాదు. అసలు నీ జాతకంలో పెళ్ళి యోగం ఉందో, లేదో..!?" సువర్చల బాధపడుతూంటే-

"అన్నింటికీ ఆ దేవుడున్నాడని చెప్పానా? వాళ్ళు అడిగిన కట్నం ఇస్తామని చెప్పండి!"

కూతురు మనసు అర్థంకాకపోయినా ఆమె మాట పుచ్చుకుని కృష్ణమూర్తిగారి సంబంధం ఖాయం చేయక తప్పింది కాదు రమణయ్యకు.

• • •

"భార్గవిగారూ... నేను మీకు నచ్చానా, లేదా?"

తాంబూలాల నాటి సాయంత్రం పెరట్లో ఏకాంతంగా ఉన్నప్పుడు అడుగుతున్న శ్రీకాంత్‌కి సిగ్గుతో పొందికగా కూర్చున్న భార్గవి-

"ఊఁ..." అని బదులిచ్చింది.

శ్రీకాంత్ మొహమాటస్తుడే కానీ, తొలిసారిగా భార్గవిని చూసినప్పుడు ఆమె అందానికి పూర్తిగా లొంగిపోయాడు. తండ్రి 'కట్నం' పేరుతో ఎక్కడ సంబంధం చెడగొడతాడోనని తెగ బాధపడిపోయాడు. భార్గవి లావణ్యం, ఆమె కలుపుగోలుతనం అతనికి పూర్తిగా నచ్చాయి.

"అలా బయటకుపోయి సిన్మా చూసి వద్దాం... వస్తారా?!" ఏమంటుందోనన్న బెరుకుతో అడిగాడు.

అమ్మని అడిగితే- "పరాయివాడు కాదు... కాబోయే మొగుడే కదా! అదీకాక- బాగా చదువుకున్నవాడు... రానంటే బాధపడతాడు!" అనడంతో అతనితో బయలుదేరింది.

తెల్లని షిఫాన్ చీరలో సువాసనలు వెదజల్లే విరజాజులు జడలో తురుముకుని, సొంపైన చీరకట్టులో ఆమెలో ఏదో కొత్తకోణం కన్పిస్తోంది.

కారులో అతని పక్కన కూర్చుని ప్రయాణం చేస్తూంటే...

ఆమెలో ఏదో తెలియని అలజడి!

చిరుగాలికి ఎగిరిన ఆమె కురులు సుతారంగా అతన్ని తాకి గిలిగింతలు పెడుతున్నాయి.

కారు స్పీడు అందుకుంటుంటే పైటచెంగు 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చినట్లు అతని వలపు కవాటాన్ని ప్రేరేపిస్తోంది.

కారు చెన్నయ్ పట్టణాన్ని వదిలి, గోల్డెన్ బీచ్ దాటి, సముద్రపు ఒడ్డున యం.జి.యం. రిసార్ట్స్ వైపు పరుగులు తీస్తోంది.

"భార్గవిగారూ! సిన్మాకని మిమ్మల్ని బయటకు తీసుకొచ్చాను. మనసు విప్పి మాట్లాడుకోవడానికి హోటల్‌కు తీసుకువెళుతున్నాను. అభ్యంతరం అయితే వెనక్కి వెళ్ళిపోదాం!"

అతని మాటల్లో ఏదో భావుకత కనిపించింది. అమ్మాయిల్ని చూస్తే కుర్రాళ్ళు ఇలాగే కవులైపోతారేమో!

"రావడానికి అభ్యంతరం ఏముంటుంది?"

తన కలల రాణి ఒకింత కొంటెతనంతో మృదువుగా పలికేసరికి శ్రీకాంత్ హృదయం మయూరమైంది.

రిసార్ట్స్‌లో రూమ్ నుండి సముద్రం చాలా స్పష్టంగా కనబడుతోంది.

చల్లని పిల్లగాలి తెమ్మెర అలా అలా పలకరిస్తూంటే- ఆమె అందానికి మెచ్చో.., అతని వ్యక్తిత్వానికి మెచ్చో.., లేక వారి ఈడుజోడుకి పరవశించో... పైన చంద్రుడు చలించి చల్లని వెన్నెల కురిపిస్తున్నాడు. క్రింద సముద్రుడు పరవశించి ఎత్తయిన కెరటాలతో ఉప్పొంగుతున్నాడు.

ఏకాంతవాసంలో ఇద్దరి గొంతులూ మూగబోయినట్లున్నాయి. పెదవి దాటి పలుకు రావడం లేదు. మనసుల్లో ఏదో తీయని భావన!

ఎదురుగా అతిలోక రాశి అందాల విందు చేస్తూంటే... మనసు మారాం చేస్తోంది- స్థితి గతి తప్పుతోంది.

చనువుగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు...

కాదనలేదు.

కొలిమిలోని ఇనుములా వలపు జ్వరం తగిలి శరీరాలు వేడెక్కిపోతున్నాయి... భార్గవి గువ్వలా ఒదిగిపోతోంది.

ఇంతకాలం పురుషుని కంటపడకుండా భద్రంగా దాచుకున్న పైటమాటు పరువాలు నయాగరా జలపాతంలా పెల్లుబుకుతున్నాయి.

పైట జారిపోయింది..!

సిగ్గుతో కళ్ళు మూసుకున్న ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు... మత్తుగా ఆమె కళ్ళు క్రిందకి వాలిపోయాయి.

వాలిన కళ్ళు తన అందాల్ని ఆస్వాదించమని సైగ చేస్తూంటే... నుదుటిపై మురిపెంగా చుంబించి, ఆమె ఎదసౌధంపై వాలిపోయాడు.

ఆ స్పర్శకి ఆమెలోని అణువణువు పులకించింది...

ప్రతి నరం జివ్వుమంది!

అమాంతంగా ఆమె కౌగిలిలో బందీ అయ్యాడు.

ఇద్దరిలోనూ పులకింత..!

ఇద్దరి హృదయాల్లోనూ నిద్రాణమై ఉన్న రౌతుగుర్రాలు పరుగులు పెడుతున్నాయి. కోర్కెల కుటీరంలోని తేనెపట్టు కదిలింది.

అతని చేతులు ఎక్కడెక్కడికో పరుగులు తీస్తున్నాయి. ఒకరి చేతుల్లో ఒకరు నలిగిపోతూంటే- తాపం తరిమితరిమి కొడుతోంది... భాషలేని భావోద్రేకం చుట్టుముట్టుతోంది.

"భార్గవీ... ప్లీజ్... ఒక్కసారి!"

చిలిపిగా కళ్ళు గుండ్రంగా తిప్పింది.

"ప్లీజ్..." చెవిలో ఏదో గొణిగాడు.

"దానికిముందు నాకు ఒక కోరిక ఉంది... తీరుస్తావా?"

"ఏమిటి?"

చెవిలో ఏదో గొణిగింది.

"ఓస్... అంతేకదా! కాబోయే పెళ్ళాం అడిగింది కాదంటే ఇక నేనెందుకు... తప్పకుండా! మరి, నా సంగతి... అదీ నీకు ఇష్టమైతేనే!"

సిగ్గుతో కళ్ళు మూసుకుంది.

"ఇష్టం లేకపోతే వద్దులే!"

"ఇష్టం లేకపోవడానికి మీరు పరాయిమనిషి కాదు కదా! కానీ, మూసుకున్న పిడికిలిని పెళ్ళికి ముందే తెరిచి ఓ మచ్చగా మిగిలిపోవడం నాకిష్టం లేదు. ఆ మధురమైన అనుభూతిని 'శోభనం'రోజు పంచుకుని ఆ తొలిఅనుభవాల్ని జీవితాంతం మదిలో భద్రపరచుకోవాలని నా కోరిక!"

"సరే... నీ ఇష్టం!"

• • •

'కట్నం తీసుకురావడం ఎలాగా..?'

– అని బాధపడుతున్న రమణయ్య భార్గవి ఇచ్చిన ఐదు లక్షల రూపాయలు చూసి మొదట ఆశ్చర్యపోయి, ఆ తరువాత ఆమెను నిలదీశాడు.

"నేను మీ కూతుర్ని! కానిపని చేసి ఇంత డబ్బు తేలేదు... నన్ను నమ్మండి!"

కూతురు మాటలు విన్న తరువాత డబ్బు తీసుకోవడం తప్పింది కాదు రమణయ్యకు.

శ్రీకాంత్, భార్గవిల పెళ్ళి అతివైభవంగా జరిగిపోయింది.

శోభనంరోజు అమ్మాయిని గదిలోకి పంపుతూ అడిగింది సువర్చల–

"ఇప్పటికైనా చెప్పవే... ఆ ఐదు లక్షలు ఎక్కడినుండి అప్పుగా తెచ్చావో?!"

"అప్పా... పాడా?! పెళ్ళికి ముందు ప్రేమించుకునే ప్రేమికులు కొందరుంటారు. పెళ్ళి తరువాత ప్రేమించుకునే జంటలు మరికొందరుంటారు. కానీ, పెళ్ళి కుదిరిన తరువాత ప్రేమలో పడ్డ చరిత్ర మాది! కట్నం ఇచ్చి నా మొగుణ్ణి నేనే కొనుక్కోవడం కోసం పెళ్ళికి ముందు ప్రియుణ్ణి డబ్బు అడిగి తీసుకున్నాను.

ఇంకా వివరంగా చెప్పాలంటే... ఆరోజు తాంబూలాలు తీసుకున్నరోజు మేము వెళ్లింది సినిమాకి కాదు... హోటల్‌కి!

స్వతహాగా శ్రీకాంత్ మంచివాడు. అక్కడ మేము మనసు విప్పి మాట్లాడుకున్నాం. అక్కడ ఆయన్ని లాలించి, ప్రేమించి రెచ్చగొట్టాను. అపార్థం చేసుకోకు. తరువాత ఉన్న విషయం చెప్పాను. మా నాన్న కట్నం ఇచ్చుకోలేడు, మీ నాన్న డబ్బు ఇవ్వకపోతే పెళ్ళికి ఒప్పుకోడు. అందుచేత ఆ ఐదు లక్షల రూపాయలు అతన్నే సర్దమని అడిగాను. వ్యక్తిగతంగా కట్నం తీసుకోవడానికి ఇష్టపడని శ్రీకాంత్– తన సంపాదన తండ్రికి తెలియకుండా నాకిచ్చాడు."

• • •

"ఆనాడు ఆ ఒక్కటీ కాదన్నావ్... కనీసం ఈరోజైనా 'ఊఁ...' అంటావా, లేదా?"

– శోభనంగదిలోకి మెల్లగా వచ్చిన పెళ్ళాన్ని దగ్గరకు తీసుకొని అడిగాడు శ్రీకాంత్.

"మెత్తని మనసుని పన్నీటితో స్నానం చేయించిన మిమ్మల్ని ఎందుకు కాదంటాను? 'ఎప్పుడెప్పుడా...' అని ఆత్రంగా ఎదురుచూస్తుంటేనూ..!"

ఒక్కసారిగా మీదకు లాక్కొని, గట్టిగా కౌగిలించుకున్నాడామెను.